ప్రజాశక్తి
శనివారం 8 జూన్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



వైసిపిలో.. అంతర్మథనం

- పార్టీని దెబ్బతీసిన అంశాలపై విశాఖ నేతల్లో చర్చ
- అధిష్టానం - కేడర్ మధ్య పెరిగిన అంతరంతోనే ఓటమి చెందామని పలువురి వ్యాఖ్య

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికల్లో ఓటమిపై వైసిపిలో అంతర్మథనం మొదలైంది. పార్టీని దెబ్బతీసిన అంశాలపై ఆ పార్టీ విశాఖ నేతలు సమీక్షించుకుంటున్నారు. 'రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ ప్రజలకు ఎంతో చేశాం. గెలిస్తే ఇంకా చేయాలనుకున్నాం. కానీ ఎలా జరిగిందో ? ఏం జరిగిందో ?. మొత్తానికి దెబ్బయిపోయాం. ఘోరపరాజయం పాలయ్యాం' అంటూ ఓటమి చెందిన నాయకులంతా ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. ఓటమి తరువాత ఎక్కువ మంది నేతలు ఇళ్లకే పరిమితమైపోయారు. రాష్ట్రం, దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను టీవీలు, ఫోన్ల ద్వారా తెలుసుకుంటూ ఎవరి అవగాహనకు వారొచ్చారు. కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపిలకు విశాఖలోని పలు సెగ్మెంట్లలో తమపై వచ్చిన మెజారిటీలపై ముఖ్యనేతలంతా తలలు పట్టుకుంటున్నారు. ఇంత వ్యతిరేకత ఉందా ? అంటూ ఆశ్చర్యానికి లోనవుతున్నారు. 'విశాఖ రాజధాని' అంశం ఉత్తరాంధ్ర ప్రాంతంలో తమను గట్టెక్కిస్తుందనుకున్న వారికి శృంగభంగమే ఎదురైంది. రుషికొండపై నిర్మాణాల విషయంలో కోర్టుల వరకూ వివాదం వెళ్లాక సైతం భవంతులను పూర్తిచేయడం ఒక శాపంగా మారిందా ? స్థానికంగా ఇది కూడా దెబ్బతీసిందా ? అన్న చర్చ సాగుతోంది.

పార్టీని నడిపేదెలా ?

ఓటమి ఎంత భయంకరంగా ఉంటుందో ప్రస్తుతం వైసిపి శ్రేణులు అనుభవం ద్వారా తెలుసుకుంటూ ఆవేదనకు గురవుతున్నాయి. మరో ఐదేళ్లపాటు పార్టీని ఎలా నడిపేది ? తామెలా ముందుకెళ్లేది ? అనే తీవ్ర ఆవేదనలో ఓటమి పాలైన నాయకులు, వార్డులు, గ్రామ స్థాయిల్లో ఉండే నాయకులు, కార్యకర్తలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ విషయంపై కొంతమంది చేసిన తప్పులను గుర్తించి పై నుంచి దిగువ వరకూ సరిచేసుకోవాలని భావిస్తుండగా.. ఇంకేదో మోసం, కుట్ర జరిగిందంటూ వైసిపి అభిమానులు బాహాటంగా చెప్పుకోవడం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో రెండో అంశాన్నే పట్టుకుని వేలాడితే భవిష్యత్తులో నష్టపోతామంటూ ఇంకొంతమంది ఆ పార్టీకి చెందిన సీనియర్లు అభిప్రాయపడడం వైసిపిలో తాజా పరిణామం.

నాడు గిర్రున తిరిగి...నేడు డీలా పడి..

2019లో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఫ్యాన్ గిర్రున మిగతా 2లో..



దొండూ దొండే నాటకంలోని ఓ సన్నివేశం

అలరించిన నాటికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ - కళాభారతి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శించిన దొండూ దొండే, మట్టి పరిమళం నాటికలు వీక్షకులను అలరించాయి. వీటిలో దొండూ దొండే చక్కని హాస్యాన్ని అందించింది. మట్టి పరిమళం ఆసాంతం ఆకట్టుకుంది. ప్రతి నెలా మొదటి శుక్రవారం ప్రదర్శించే నాటికల్లో భాగంగా వీటిని ప్రదర్శించినట్టు నిర్వాహకులు తెలిపారు. ముందుగా అకాడమీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాంబాబు గుమ్ములూరి, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ డేవిడ్ రాజు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ స్థానిక నాటక సంస్థలను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నామన్నారు.

ప్రమాణాల మేరకు ప్రదర్శనలకు సిద్ధపడి దరఖాస్తు చేసుకున్నట్లయితే స్క్రిప్ట్ పరిశీలించి బాగుంటే తప్పకుండా అవకాశమిస్తామన్నారు. ఈ నెల 23న ప్రముఖ రచయిత, సాహిత్యపరంగా ఎంతో సేవచేసిన డాక్టర్ రామవరపు శరత్‌బాబుకు 'సాహిత్య కళా భారతి' బిరుదుతో పురస్కారం అందజేయనున్నట్టు తెలిపారు. కళలను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని గుర్తుచేశారు.

'ఉక్కు' రక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలి

▶ వార్త మెయిన్‌లో..

'ఉపాధి' రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలి

▶ వార్త 5లో..

ఎన్నికల్లో జర్నలిస్టుల సహకారం మరువలేనిది

▶ వార్త 2లో..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జీ, చిత్రంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

టీచర్ల బదిలీ అక్రమాల్లో..

బొత్సను వదిలిపెట్టేది లేదు : టిడిపి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టీచర్ల బదిలీల పేరిట కోట్ల రూపాయలు దోచేసిన మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను వదిలేది లేదని, ఆయనపై కేసు పెట్టనున్నామని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు సమయంలో ఎటువంటి బదిలీలూ చేయకూడదన్నారు. అందుకు విరుద్ధంగా బొత్స గత ప్రభుత్వ హయాంలో వ్యవహరించారని తెలిపారు. ఆయన మిగతా 2లో..

భయపెడుతున్న పాత భవనాలు

పాత నగరంలో ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని ప్రజలు జీవనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గ్రేటర్ విశాఖ పరిధిలోని పాత నగరం ప్రజలు నిత్యం ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని జీవించే పరిస్థితి నెలకొంది. దీనికి కారణం లేకపోలేదు. పాత నగరం కావడంతో కొన్ని దశాబ్దాలకు ముందు అక్కడ నిర్మించిన భవనాలు చాలావరకు శిథిలావస్థకు చేరాయి. ఈ ప్రాంతంలో అనేక వీధుల్లో భవనాలకు కాంక్రీట్ పునాదులు లేవు. మరికొన్ని భవనాలు సిమెంటుతో కాకుండా సున్నం, ఇటుకలతో కలిపి అప్పుడెప్పుడో నిర్మితమైనవి. చిన్న చిన్న వీధులలో ఉన్న పాత భవనాలు ఒక దానిని ఆనుకొని పిచ్చుక గూళ్ల వలే ఇక్కడ కనిపిస్తాయి. ఏళ్ల తరబడి వీటికి మరమ్మతులు చేయడంగానీ, పూర్తిగా తొలగించి కొత్తవి నిర్మించడంగానీ జరగలేదు. పైగా ఈ ప్రాంతంలో కాలుష్యం అధికంగా ఉంటుంది. సందులు సందులుగా ఉండటంవల్ల ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి. ఇటువంటి పురాతనమైన ఇళ్లు భారీ వర్షాలు కురిసిన సందర్భంలో అనేకసార్లు కూలిపోవడం, పూర్తిగా నేలమట్టం కావడం, వాటిలో నివసిస్తున్న కొందరు మృత్యువాత పడటం, మరికొందరు తీవ్రస్థాయిలో గాయాలపాలవడం నిత్యకృత్యంగా మారింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పాత నగరం పాత 20వ వార్డు, రామాలయం సమీపంలోని గొల్ల వీధిలో 20-100-5 డోర్ నెంబర్‌గల ఒక పురాతన గృహం పూర్తిగా కూలిపోయి నేలమట్టమైంది. దీనిని వందేళ్ల క్రితమే నిర్మించారని స్థానికులు అంటున్నారు. ఆ సమయంలో అందులో ఎవరూ లేరు. ఆ ఇంటిని అద్దెకు ఇస్తామని లేదా అమ్మకం చేస్తామని గృహ యజమాని కాశీ బోర్డు పెట్టి ఎక్కడికో వెళ్లిపోయారు. దీంతో ఎటువంటి ప్రాణ నష్టమూ ఆదివారం జరగలేదు. శిథిలావస్థలో ఉన్న పురాతన కట్టడాలను తొలగించాలని దాదాపు రెండేళ్ల క్రితం అప్పటి మిగతా 2లో..



పాత నగరంలో ఇటీవల కూలిన ఓ ఇల్లు

మొదటి పేజీ తరువాయి..

వైసిపిలో అంతర్మథనం

తిరిగింది. ఎక్కువ సీట్లు కొల్లగొట్టింది. 2024 ఎన్నికలో దాని రెక్కలు విరిగిపోయాయి. విశాఖ పార్లమెంట్ పరిధిలోని గత ఎన్నికల్లో గాజువాక, భీమిలి, శృంగవరపు కోట, విశాఖ ఎంపీ సీటును వైసిపి కైవశం చేసుకుంది. గ్రామీణ విశాఖ (ప్రస్తుత అనకాపల్లి, అల్లూరి జిల్లాలు)లో అన్ని సీట్లనూ గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. విశాఖ, అనకాపల్లిల్లో ఆ పార్టీ ఒక్క సీటునూ గెలవలేకపోయింది. అల్లూరి జిల్లాలో మాత్రం పాడేరు, అరకుల్లో వరుసగా గెలిచింది. ఏదేమైనా ఓటమి పరిణామాలన్నీ వైసిపిని ప్రస్తుతం కుంగదీస్తున్నాయి. సచివాలయాలు, వాలంటీర్లతో రాజకీయ పని అయిపోతుందనే భ్రమల్లో అధిష్టానం ఉండడం, గ్రామ, వార్డు, మండల స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలకు పనిలేకుండా చేయడంతో 2024 ఎన్నికల యుద్ధంలో 'మూడు పార్టీల కూటమి' రాష్ట్రాన్ని ఎత్తుకుపోయిందంటూ వైసిపిలో చదువుకున్న యువత బాహాటంగా విశాఖలో చెప్పడం విశేషం. కేడర్‌ను కలుపుకుని పోయేలా కాకుండా వారిని పట్టించుకోకుండా సచివాలయాలు, వాలంటీర్లు, ఐప్యాక్ బృందాలపై ఆధారపడడం వల్లే ఈ స్థితి నెలకొందంటూ వీరు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైసిపి నాయకుల ఇళ్లపై జరుగుతున్న దాడులపైనా జిల్లాల వారీగా వైసిపి అధిష్టానం లీగల్ సెల్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల స్థాయి నాయకులతో న్యాయ కమిటీలను శుక్రవారం వేయడం విశేషం. ఇక కూటమి ప్రమాణ స్వీకారం 12న జరిగాక పరిణామాలు ఎలా ఉంటాయో అన్న అంచనాల్లో వైసిపి నేతలు తలమునకలై ఉన్నారు.

బొత్సను వదిలిపెట్టేది లేదు : టిడిపి

దోపిడీదారుడని చరిత్రనే చెబుతుందన్నారు. టీచర్లను బదిలీ చేస్తామని రూ.3 నుంచి 6 లక్షలు వసూలు చేశారని, ఆ రూపంలో రూ.100 కోట్లు వరకూ కొట్టేశారని ఆరోపించారు. ఈ విషయమై టీచర్లు ఇప్పటికే చాలామంది ఫిర్యాదు చేశారని వెల్లడించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎపి ప్రజలు కూటమికి చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా గొప్ప విజయం అందించారని ఆనందం వ్యక్తం చేశారు. గాజువాక ప్రజలు తనకు రాష్ట్రంలోనే రికార్డు స్థాయి మెజారిటీ ఇచ్చారన్నారు. టీచర్ల బదిలీ కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన బొత్స సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీచర్ల తరపున తాము కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. బొత్స టీమ్‌పై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని డిపార్టుమెంటుల్లోనూ ఈ తరహా కుంభకోణాలు జరిగాయని, వాటిపైనా దృష్టి పెడతామని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భయపెడుతున్న పాత భవనాలు

మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. దానికి ఉదాహరణగా తాజా పరిణామాన్ని చెప్పవచ్చు. జివిఎంసి జోన్ – 4 టౌన్ ప్లానింగ్ అధికారులు ఇటువంటి శిథిలావస్థకు చేరిన గృహాలను గుర్తించి నోటీసులు జారీ చేసి, యజమానులను హెచ్చరించి, అవసరమైతే ఇటువంటి భవనాలను కూల్చివేయవలసి ఉందని, కానీ వారి నిర్లక్ష్యం వల్ల ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. 'శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలని మూడేళ్ల క్రితం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆ తరువాత పట్టించుకోవడం మానేశారు' అని వారంటున్నారు.

జగన్‌కు ప్రజలు బుద్ధిచెప్పారు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : వైఎస్.జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చి మడమ తిప్పినా, ప్రజలు మాత్రం మాట తప్పకుండా ఆయన్ని గద్దె దించి తగిన విధంగా బుద్ధి చెప్పారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను డాబాగార్డెన్స్ సమీపంలో ఉన్న కృష్ణా గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో రామ్ కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పుడో ఎమ్మెల్యే కావాల్సిన వంశీ పట్ల వైసిపి అవమానకరంగా వ్యవహరించి కార్పొరేటర్ పదవికి పరిమితం చేయాలని భావించిందన్నారు. మేయర్ పదవి ఇస్తామని చెప్పి మరో మోసం చేసిందన్నారు. ప్రత్యక్ష రాజకీయాలలో కొనసాగడం వంశీకి ఇష్టమైనప్పటికీ ఎమ్మెల్సీ పదవిని కేటాయించిందన్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ పదవి మరో నాలుగేళ్లు ఉన్నప్పటికీ వైసిపి నుంచి బయటికి వచ్చి వంశీ తన సత్తా ఏమిటో చూపించారన్నారు. ఆయన తనకు మంచి మిత్రుడని, భవిష్యత్తులో ప్రజలకు మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఎన్నికల్లో జర్నలిస్టుల సహకారం మరువలేనిది

ఆత్మీయ సమావేశంలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి జర్నలిస్టులు ఎంతో సహకరించారని, పొరపాట్లు జరగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారని, వారి సహకారం మరువలేనిదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ఎన్నికల జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియకు సంబంధించి అనేక కథనాలు ప్రచురించటం ద్వారా పొరపాట్లను సవరించేలా యంత్రాంగానికి మార్గ దర్శకం చేశారని అన్నారు. వివిధ మార్గాల్లో జిల్లా యంత్రాంగానికి సహకారం అందించిన మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సజావుగా, విజయవంతంగా జరిగిన నేపథ్యంలో జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జర్నలిస్టులు అందించిన సహకారాన్ని, సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి ఎన్నో విధాలుగా సేవలందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి యంత్రాంగం తరపున అనేక విధాలుగా కృషి చేశామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. చాలా మందికి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించామని, ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. సంజీవని నిధి ద్వారా అవసరమైన వారికి ఆర్థిక సాయం కూడా అందించామని గుర్తుచేశారు. ఇళ్ల స్థలాల జారీ ప్రక్రియకు సంబంధించి పలు సమావేశాలు నిర్వహించి సానుకూల నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. వారి సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. జూలై ఒకటో తారీఖు నుంచి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. జర్నలిస్టుతో పాటు వారి జీవిత భాగస్వామికి కూడా అవకాశం కల్పించనున్నామని స్పష్టం చేశారు. ఆగస్టు నుంచి జర్నలిస్టుల హెల్త్ స్కీంకు సంబంధించి ప్రీమియం రెన్యువల్ కూడా చేస్తామని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియకు సంబంధించి కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. అలాగే జిల్లాకు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టామని, దానిలో భాగంగా పెట్రోలియం అవుట్‌లెట్లు ఏర్పాటు చేశామని వివరించారు. సిఎస్ఆర్ నిధులు సుమారు రూ.18 కోట్లతో కింగ్ జార్జి ఆసుపత్రిలో ఆధునిక వసతులు కల్పించామని, పలు అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. రూ.10.82 కోట్లు వినియోగించి పలు వసతి గృహాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు.

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో మీడియా ప్రశంసనీయ పాత్ర పోషించిందని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పేర్కొన్నారు. మీడియా కథనాలకు అనుగుణంగా అనేక చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మీడియా అనేక రూపాల్లో కథనాలను ప్రచురించిందని, యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందని ఉద్ఘాటించారు.

పోలీస్ శాఖ నుంచి ఎప్పటికప్పుడు పలు చర్యలు చేపట్టామని, పెట్రోలింగ్ బృందాలు, స్ట్రైకింగ్ బృందాలతో శాంతిభద్రతలను పరిరక్షించామని పేర్కొన్నారు. ఆత్మీయ సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్, సిపి, జెసి జర్నలిస్టులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్లు శేషశైలజ, అఖిల, సీతారామమూర్తి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్‌వి.రమణ పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో జర్నలిస్టులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ఎయు వద్ద టిడిపి సంబరాలు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : కూటమి విజయంతో ఆంధ్ర యూనివర్సిటీ ముఖద్వారం వద్ద టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవాలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్టాభిరామ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి కూటమి విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో విశ్వవిద్యాలయాలు వైసిపి కార్యాలయాలుగా మారాయన్నారు. ఎయులో రాజకీయ నాయకుల విగ్రహాలు తొలగించాలన్నారు. గత ప్రభుత్వంలో అధికార, కుల మదంతో రెచ్చిపోయిన వారందరికీ తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. కార్యక్రమంలో బొట్టా వెంకట రమణ, అమరేంద్ర, మూర్తి పాల్గొన్నారు.

బిజెపి కార్యాలయంలో..

మోడీని ఎన్‌డిఎ ప్రధాని అభ్యర్థిగా ఎన్నుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని బిజెపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎస్‌విఎస్.ప్రకాష్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇంచార్జి ఎన్.విజయానంద రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్ యాదవ్, పొలిమేర శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మీ సేవలు నిరుపమానం'

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : తనను 24 గంటలూ కంటికి రెప్పలా చూసుకున్న గన్‌మెన్ల సేవలు నిరూపమానమని వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కొనియాడారు. శుక్రవారం తన కార్యాలయంలో గన్‌మెన్లు ఎ.అప్పలనాయుడు, జి.బులినాయుడులను వాసుపల్లి ఘనంగా సత్కరించారు. మిఠాయిలు తినిపించారు. వారు కూడా వాసుపల్లి భవిష్యత్తులో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు. వాసుపల్లి గణేష్ కుమార్‌ను వీడి వెళ్లడం పట్ల కన్నీటి పర్యంతమయ్యారు.

వికలాంగ విద్యార్థుల గుర్తింపు



వికలాంగ బాలలను గుర్తిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఆదేశాల మేరకు బడి బయట ఉన్న 0 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన 21 రకాల వైకల్యాలు కలిగిన విద్యార్థుల గుర్తింపును అధికారులు చేపట్టారు. బడిలో వారి పేర్లు నమోదు చేస్తున్నారు. పద్మనాభం మండలంలో ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా మే 1వ తేదీ నుంచి చేపట్టారు. రెడ్డిపల్లిలో చేపట్టిన ఈ గుర్తింపు కార్యక్రమాన్ని శుక్రవారం సమగ్ర శిక్షా జిల్లా సహిత విద్యా సమన్వయాధికారి బి.గీత, మండల విద్యాశాఖాధికారి పొన్నగంటి రమణ పర్యవేక్షించారు. గ్రామాల్లో గుర్తించిన వికలాంగ విద్యార్థులకు మండల కేంద్రంలోని భవితా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను, చదువు వల్ల కలిగే ప్రయోజనాలను, ఫిజియోథెరపీ సేవలను, ప్రభుత్వం ద్వారా వచ్చే ఉపకార వేతనాల గురించి వివరించారు. ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, రీడర్, హెచ్‌బిఇ, గర్ల్ చైల్డ్ అలవెన్స్‌లను ఒక ఏడాదికి రూ.3000 చొప్పున ఇవ్వనున్నట్లు తల్లిదండ్రులకు వివరించారు. ఈ సర్వేలో ఇప్పటివరకు 20 మందిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సర్వే ఈ నెల 9వ తేదీ వరకూ జరుగుతుందని చెప్పారు. సర్వేలో సమగ్ర శిక్షా ఎపిఒ అప్పలనాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయులు హెచ్.రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందపురం: ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు, నమోదు కార్యక్రమంలో భాగంగా దుక్కవానిపాలెంలో శుక్రవారం ఆనందపురం మండల సహిత విద్యా విభాగం ఉపాధ్యాయులు కలమట శ్రీనివాసరావు, ఐ.నాగమణి నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా సహిత విద్యా విభాగం సమన్వయకర్త బి.గీత పర్యవేక్షించారు. వికలాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోపరుచుకోవాలని కోరారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి- మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మహిహ అదృశ్యమైనట్లు పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిఐ కథనం ప్రకారం... మారికివలస రాజీవ్ గృహకల్పలో బ్లాక్ నెంబర్ 14లో చెంబు సునీత ఏడాది నుంచి నివాసముంటున్నారు ఆమె భర్త కుమారుడు కాకినాడలో ఉంటున్నారు. గతనెల సునీత తమ్ముడు రఘు వచ్చి చూడగా ఆమె ఇంటికి తాళం వేసి ఉన్నట్లు గుర్తించి బంధువులు ఇళ్లల్లో ఆరా తీశారు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెచ్‌సి శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

లోకేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మంగళగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి మంచి మెజారిటీతో గెలుపొందిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ శుక్ర వారం అమరావతిలో కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకోవాలని లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మత్స్యకార భరోసా పథకం అమలులో పొందుపర్చిన కొన్ని నిబంధనలు సడలించి లబ్ధిదారులందరికీ భృతి ఇవ్వాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీజిల్ వినియోగంలో భాగంగా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని వినియోగించుకోలేదన్న కారణం చూపి జిల్లాలో 2061 మందికి భరోసా నిలిపివేయడం ఏమేరకు సబవని ప్రశ్నించారు. డీజిల్ ధరలు పెరగడం వల్ల ఆర్థిక ఇబ్బందుల వల్ల వినియోగించు కోలేకపోయినట్లు తెలిపారు. లబ్ధిదారులందరికీ భృతి ఇవ్వాలని కోరారు.

10 నుంచి యోగాలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కృష్ణా కాలనీ అంతర్జాతీయ యోగ పరిశోధన, శిక్షణా సంస్థ ఆధ్వర్యాన చిట్టివలసలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస కల్యాణ మండపంలో ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు యోగాలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ఉచిత శిక్షణా తరగతులను ఆసక్తి గల వారు వినియోగించు కోవాలని కోరారు. ఆయా తేదీల్లో ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పల్లాను కలిసిన జిమా సభ్యులు

ప్రజాశక్తి -ములగాడ : గాజువాక మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (జిమా) సభ్యులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిమా కమిటీ సభ్యులు గుడివాడ శ్రీనివాసరావు, పైడిరాజు నూనెల, ఊకోటి వెంకటేశ్వరరావు (నాని), దుబాయ్ రాజు, పూజారి అప్పలనాయుడు, అల్లు జోగినాయుడు, ఈవిఆర్, విజయ్, సౌదీ సురేష్, డైరెక్టర్ నవీన్ తేజస్, శరత్ కుమార్, జ్యోతి కుమారి, కె.మంగ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసిన జిమా సభ్యులు

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యాన శుక్రవారం బిఎన్ఆర్.నగర్‌లో పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించడంపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలు, చిన్నారులు, ఆశా వర్కర్లు, శానటరీ సిబ్బంది పర్యావరణాన్ని రక్షించాలని కోరుతూ బిఎన్ఆర్ నగర్ నుంచి తోటగరువు మీదుగా ఆరిలోవ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు బిఎన్ఆర్ నగర్‌లో చిన్నారులు, మహిళలచే మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, లలిత, రమణ, తవిటినాయుడు, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ టిఎంఒ ఆర్.శంకరరావు, డి.సాయిరాం, యుష్మా, స్వాతి, గౌతమి, సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని మజ్జిపేట జెడ్పీ హైస్కూల్‌లో మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పర్యావరణ ప్రాధాన్యతను తెలుపుతూ చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, ఎస్ఎంసి చైర్మన్ లక్ష్మణరావు, ఎఎన్ఎం రమణమ్మ, ఆశా వర్కర్ ఈశ్వరమ్మ, మ్యాజిక్ బస్ మానిటరింగ్ అధికారి దూడ రమేష్, సభ్యులు శారద, దుర్గ, రమ్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

కూటమి విజయోత్సవాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు టిడిపి అధ్యక్షుడు ముక్క కిషోర్ కుమార్ ఆధ్వర్యాన వార్డులో కూటమి అభ్యర్థులు విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి మాట్లాడుతూ, రానున్న కాలంలో మరింత సంక్షేమ పథకాలు, అభివృద్ధి దిశగా కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటారని తెలిపారు. ఇంతటి గొప్ప విజయాన్ని అందించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. బాణాసంచాతో డప్పులతో మహిళలు ఉత్సాహంగా డాన్సులు వేసి అలరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎం.ముచ్చులనాయుడు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచకర్లకు మంత్రిపదవంటూ అభిమానుల సందడి

ప్రజాశక్తి-పెందుర్తి : ఎన్నికల ముందు పెందుర్తి నియోజకవర్గ టికెట్ కోసం కూటమిలో తర్జనభర్జను జరిగి చివరి నిమిషంలో జనసేనకు కేటాయించారు. దీంతో పంచకర్ల రమేష్‌బాబుకు పవన్‌కల్యాణ్ టికెట్ కేటాయించారు. తక్కువ టైంలోనే వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిపై 81,870 ఓట్ల తేడాతో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక మంత్రి పదవులపై చర్చ సాగుతోంది. గురువారం జరిగిన సమావేశంలో కార్యకర్తలు నాయకులు పంచకర్లకు మంత్రి పదవి రావాలంటూ కేరింతలు పెట్టారు. దీనిపై పంచకర్ల స్పందిస్తూ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉందామన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి

- మునగపాకలో రైతు, సింహాచలంలో లైన్‌మ్యాన్

ప్రజాశక్తి- యంత్రాంగం

మునగపాక: మండలకేంద్రం మునగపాకకు చెందిన రైతు దాడి సంతోష అప్పారావు (36) విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం రోజువారి మాదిరిగానే శుక్రవారం ఉదయం తన తండ్రి శివతో కలిసి తమ కళ్లంలో పొలం పని చేసేందుకు సంతోష్ వెళ్లాడు. విద్యుత్ స్తంభం పక్కనే పశువుల గత్తం ఎత్తుతుండగా, విద్యుత్ స్తంభానికి ఆనుకొని సపోర్ట్ వైరును తాకడంతో సంతోష్ అప్పారావు షాకుకు గురయ్యాడు. విద్యుత్‌షాక్‌తో కొడుకు అపాస్మారక స్థితికి చేరుకున్న కొడుకును చూసి కిందపడిపోయిన తండ్రి శిణను సమీప రైతులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే సంతోష్ అప్పారావు మరణించాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడు సంతోష్ అప్పారావు కు భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మతుని భార్య హేమలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. ప్రసాదరావు తెలిపారు.

గోపాలపట్నం : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సింహాచలం సమీపంలోని అప్పన్నపాలెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... పులమరశెట్టి వెంకటరావు (47) జివిఎంసి 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఏపీఎస్పీబీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చేరి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జూనియర్ లైన్‌మ్యాన్‌గా ప్రమోషన్ పొందాడు. శుక్రవారం మధ్యాహ్నం అప్పన్నపాలెంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మత్తు పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే వెంకటరావును స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే వెంకటరావు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటరావు మృతివార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

డబ్బు కోసం బెదిరించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో డబ్బు కోసం బెదిరించిన వ్యక్తిని పిఎం.పాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్త్ జోన్ ఎసిపి సునీల్ తెలిపారు. స్టేషన్లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జివిఎంసి 7వ వార్డు కారుషెడ్ ప్రాంతానికి చెందిన పోతిన వెంకటరావు (బాబు) తన భార్య, ఇద్దరు కుమారులుతో కలిసి నివాసముంటున్నారు. ఇతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. అతని భార్య చార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తుతెలియని వాట్సాప్ నెంబర్ నుంచి వెంకటరావుకు ఓ మెసేజ్ వచ్చింది. అందులో 'మీ ఇద్దరు కుమారులలో ఒకరిని చంపేందుకు ఒక అసైన్మెంట్ వచ్చిందని, కావలిసిన డబ్బులు ఇవ్వకపోతే తన పని తాను చేస్తానని' మెసేజ్ సారాంశంగా ఉంది. దీంతో వారు భయపడి సదరు వాట్సాప్ నెంబర్‌ఋ బ్లాక్ చేసి 3, 4 తేదీల్లో కుటుంబం భయంతో బయటకు వెళ్లలేదు. 5వ తేదీ మధ్యాహ్నం సుమారు 1 గంటకు సదరు వాట్సాప్ నెంబర్‌ను అన్‌లాక్ చేయగగా మధ్యాహ్నం 1.35 గంటలకు అతనికి ఆ నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్ చేయగా ఎవరూ మాట్లాడలేదు. పిల్లవాడిని చంపకుండా ఉండాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని వాట్సాప్ మెసేజ్ వచ్చింది. భయపడిన వెంకటరావు రూ.5 లక్షలు గుర్తు తెలియని వ్యక్తికి ఇచ్చేందుకు అంగీకరించాడు. 6వ తేదీ ఉదయం 11 గంటలు వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అదే రోజు పిఎం పాలెంలోని సాంకేతిక కాలేజీ గేటు నెంబర్2 వద్ద డబ్బులు ఇవ్వాలని గుర్తు తెలియని వ్యక్తి సూచించాడు. దీనిపై వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు సిఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక కాలేజీ గేటు నెంబర్-2 వద్దకు బాధితుడిని నగదుతో పంపి సిఐ సిబ్బందితో మాటు వేశారు. నిందితుడు డబ్బులు తీసుకోడానికి ఎపి 31బికె 4040 కారులో వచ్చాడు. డబ్బులు తీసుకోడానికి రాగా అప్పటికే మాటు వేసిన పోలీసులు పట్టుకున్నారు. నిందితుడుది అనకాపల్లి జిల్లా రాంబిల్లికి చెందిన శివకోటి నాగ వెంకట్ పవన్‌గా గుర్తించారు. కారు, నగదుతో పాటు ఓ కత్తి, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ప్రస్తుతం పిఎం.పాలెంలో నివాసం ఉంటునట్లు ఎసిపి తెలిపారు. నిందితునికి రూ.15 లక్షలు అప్పు ఉందని, అందుకే ఈ నేరం చేసినట్లు అంగీకారించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వై.రామకృష్ణ, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.



చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్

ఏయూ విద్యార్థుల చిత్రకళ ప్రదర్శన

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం చిత్రకళా విభాగంలో బిఎఫ్ఎ, ఎంఎఫ్ఎ చివరి సంవత్సరం విద్యార్థులు తమ కోర్సులో భాగంగా తయారుచేసిన వివిధ చిత్రాలు, శిల్పాలతో ఏర్పాటుచేసిన చిత్ర కళాప్రదర్శనను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ శుక్రవారం ప్రారంభించారు. శివాజీపాలెంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తిలకించారు. ఎంతో సృజనాత్మకంగా ఆలోచిస్తూ వైవిధ్యమైన మాధ్యమాలను ఉపయోగించి చిత్రాలను తయారుచేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి సింహాచలం, పూర్వ ఆచార్యులు ఆచార్య వి.రమేష్, ఆచార్య మహేశ్వర దాస్ పాల్గొన్నారు.



విద్యుత్ పనులు చేస్తున్న కార్మికులు

జోన్-3 కార్యాలయం రీమోడలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోన్-3 కార్యాలయాన్ని సుమారు రూ.50 లక్షల వ్యయంతో రీమోడలింగ్ చేస్తున్నారు. ఈ భవన నిర్మాణం జరిగి మూడు దశాబ్దాలుగా పైగా అవడంతో కార్యాలయంలో కొంత భాగం దెబ్బతింది. దీంతో జివిఎంసి నిధులు కేటాయించింది. సెల్లార్ ఫైభాగంలో లైటింగ్స్, జోనల్ కమిషనర్ కార్యాలయం, పట్టణ ప్రణాళిక కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం నూతనంగా నిర్మిస్తున్నారు. కార్యాలయం రీ మోడలింగ్ పనులు జరగడంతో అధికారులు విధులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. జివిఎంసి మెయిన్ కార్యాలయంలో పనులు నిర్వహిస్తున్నారు. పనుల నిమిత్తం జోన్-3 కార్యాలయానికి వచ్చే ప్రజలు అధికారులు అందుబాటులో లేక వెనుదిరుగుతున్నారు. రెండు నెలల నుంచి ఈ పరిస్థితి ఉండటంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పనులు వేగవంతం చేసి కార్యాలయాన్ని వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఇఇ రమణమూర్తిని వివరణ కోరగా కొద్ది రోజుల్లో పనులు పూర్తవుతాయని తెలిపారు.



రోడ్లపై చేరిన మురుగు నీరు

రోడ్లపై మురుగు నీరు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోన్- 3 పరిధిలో డ్రెయినేజీలు పొంగి రోడ్డుమీద మురుగు నీరు ప్రవహించడంతో అటువైపుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జివిఎంసి 25వ వార్డులో శ్రీలక్ష్మి రెసిడెన్సి అపార్ట్‌మెంట్ డ్రెయినేజీ పొంగిపొర్లడంతో రోడ్డు మీదే మురుగు నీరు చేరింది. జివిఎంసి 26వ వార్డు పరిధి రామకృష్ణనగర్‌లో, 14వ వార్డులో పోర్టు గేటు ముందు మార్గంలో డ్రెయినేజీలు పొంగి రోడ్డు మీదే మురుగు నీరు ప్రవహిస్తోంది. వీటి వల్ల వాకర్స్, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జివిఎంసి అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


అన్ని వార్డుల్లో టిడిపి జోరు

పల్లాకు రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ

గాజువాకలో కూటమికి 1,55,587, వైసిపికి 61,529 ఓట్లు

ప్రజాశక్తి- గాజువాక : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో గాజువాక నియోజకవర్గం కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించారు. పల్లా శ్రీనివాసరావు సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌పై 95235 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. వార్డుల వారీగా సాధించిన ఓట్లు వివరాలు..

జివిఎంసి 64వ వార్డులో పల్లా శ్రీనివాసరావుకు 10,411 ఓట్లు, వైసిపి అభ్యర్థి అమర్‌నాథ్‌కు 3,563 ఓట్లు పోలయ్యాయి. వార్డులో పల్లాకు 6,848 ఓట్ల మెజార్టీ లభించింది. 65వ వార్డులో పల్లాకు 9119 ఓట్లు రాగా, అమర్‌నాథ్‌కు 3108 ఓట్లు వచ్చాయి. పల్లాకు 6011 ఓట్ల మెజార్టీ లభించింది. 66వ వార్డులో పల్లాకు 6852, అమర్‌నాథ్‌కు 3280 ఓట్లు పోలయ్యాయి. టిడిపి 3582 మెజార్టీ లభించింది. 67వ వార్డులో పల్లాకు 8654, అమర్‌నాథ్‌కు 2841 ఓట్లు వచ్చాయి. పల్లాకు 5813 మెజార్టీ లభించింది. 68వ వార్డులో పల్లాకు 7824, అమర్‌నాథ్‌కు 4386 ఓట్లు లభించాయి. టిడిపికి 3438 మెజార్టీ వచ్చింది. 69వ వార్డులో పల్లాకు 8323 ఓట్లు, అమర్‌నాథ్‌కు 5129 ఓట్లు వచ్చాయి. పల్లాకు 3194 మెజార్టీ లభించింది. 70వ వార్డులో పల్లాకు 8884 ఓట్లు, అమర్‌నాథ్‌కు 2945 ఓట్లు లభించాయి. టిడిపికి 5939 మెజార్టీ వచ్చింది. 71వ వార్డులో పల్లాకు 9620 ఓట్లు, అమర్‌నాథ్‌కు 3458 ఓట్లు వచ్చాయి. టిడిపికి 6162 మెజార్టీ లభించింది. 72వ వార్డులో పల్లాకు 8142, అమర్‌నాథ్‌కు 2558 ఓట్లు వచ్చాయి. పల్లా 5384 మెజార్టీ సాధించారు. 73వ వార్డులో పల్లా శ్రీనివాసరావుకు 8727 ఓట్లు, అమర్‌నాథ్‌కు 2581 ఓట్లు వచ్చాయి. పల్లా 6146 మెజార్టీ సాధించారు. 74వ వార్డులో పల్లాకు 9070 ఓట్లు, అమర్‌నాథ్‌కు 3383



ఓట్లు లభించాయి. పల్లా 5687 మెజార్టీ సాధించారు. 75వ వార్డులో పల్లాకు 8920, అమర్‌నాథ్‌కు 4236 ఓట్లు లభించాయి. 4684 మెజార్టీని పల్లా సాధించారు. 76వ వార్డులో పల్లాకు 7530 ఓట్లు, అమర్‌నాథ్‌కు 3072 ఓట్లు వచ్చాయి. పల్లా 4458 మెజార్టీ సాధించారు. 78వ వార్డులో పల్లాకు 2232, అమర్‌నాథ్‌కు 1248 ఓట్లు లభించాయి. పల్లా 984 ఓట్లు మెజార్టీ సాధించారు. 79వ వార్డులో పల్లాకు 4323 ఓట్లు, అమర్‌నాథ్‌కు 1397 ఓట్లు వచ్చాయి. 2926 మెజార్టీని పల్లా సాధించారు. 85వ వార్డులో 10731 ఓట్లు పల్లాకు రాగా, అమర్‌నాథ్‌కు 3239 ఓట్లు లభించాయి. పల్లాకు 7492 మెజార్టీ లభించింది. 86వ వార్డులో పల్లాకు 12161 ఓట్లు, అమర్‌నాథ్‌కు 4611 ఓట్లు వచ్చాయి. పల్లా 7550 మెజార్టీ సాధించారు. 87వ వార్డులో 10528 ఓట్లు పల్లాకు రాగా, అమర్‌నాథ్‌కు 4959 ఓట్లు లభించాయి. పల్లా 5569 ఓట్ల మెజార్టీ సాధించారు. 88వ వార్డులో పల్లాకు 3526 ఓట్లు, అమర్‌నాథ్‌కు 1335 ఓట్లు వచ్చాయి. 2191 మెజార్టీని పల్లా సాధించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా పల్లాకు 2116 రాగా, అమర్‌నాథ్‌కు 939 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కూడా పల్లా శ్రీనివాసరావే 1177 ఓట్ల మెజార్టీ సాధించారు. మొత్తం మీద పల్లా శ్రీనివాసరావుకు 1,55,587 ఓట్లు రాగా, అమర్‌నాథ్‌కు 61,529 ఓట్లు లభించాయి.

ప్రభుత్వ వ్యతిరేకతతోనే ఈ మార్పు : ఎమ్మెల్యే పల్లా



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే ప్రజలు ఓటు ద్వారా మార్పు చూపించారని, ఇంతటి ఘన విజయాన్ని అందించారని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. 76వ వార్డు పరిధి బర్మాకాలనీలో వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యాన శుక్రవారం అమ్మవారి మొక్కును పల్లా శ్రీనివాసరావు చెల్లించుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి, 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, గాజువాక ప్రజలు అఖండ విజయాన్ని అందించారని, వారికి ఎప్పుడూ రుణపడి ఉంటానని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షుడు బొసెట్టి అప్పారావు, తాటికొండ సుదర్శన్, కాతా బాలకృష్ణ, వెల్లంకి శివరాం ప్రసాద్, వియ్యపు వెంకన్న, రౌతు గోవింద్, ములకలపల్లి ఈశ్వరరావు, కూన వెంకటరావు, రాజా, సత్యారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులు 'గీతం రాయబారులు'

ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవంలో ప్రో విసి గౌతమ్‌రావు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రవేశాలు పొందిన వివిధ దేశాల విద్యార్థులను అంతర్జాతీయంగా గీతం పేరు ప్రఖ్యాతులను విస్తరింప చేసే గీతం రాయబారులుగా పరిగణిస్తామని విశ్వవిద్యాలయం గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. గీతంలో వివిధ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశాలకు తిరిగి వెళుతున్న విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పట్టభద్రుల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల కోసం ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకుంటోందని, చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల ద్వారా తీర్చిదిద్దుతోందని చెప్పారు. విద్యార్థులు దేశానికి, సమాజానికి ఉపయోగపడేలా తమ మేధస్సును ఉపయోగించాలని పిలుపునిచ్చారు. స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య, పరిశోధనల ద్వారా తమ దేశాలకు ప్రయోజనం కలిగించే మానవ వనరులుగా మారాలని కోరారు. గీతం అంతర్జాతీయ విద్యా వ్యవహారాల విభాగం డైరెక్టర్ కెపిసి.కిషన్ మాట్లాడుతూ 25 దేశాలకు చెందిన 400 మంది విదేశీ



ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవంలో పట్టాలు అందుకున్న విదేశీ విద్యార్థులు

విద్యార్థులు గీతం విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది గీతం విశాఖ ప్రాంగణం నుంచి 51 మంది విదేశీ విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మసీ, లా, సైన్స్, పారామెడికల్ కోర్సులతో పాటు మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసుకున్నారని తెలిపారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గీతం న్యాయ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశన్ బాలు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

కూటమికి చారిత్రాత్మక విజయం

ప్రజాశక్తి -కరాస: తెలుగుదేశం, జనసేన బిజెపి కూటమికి రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక విజయాన్ని అందించారని విశాఖ పార్లమెంట్ కమిటీ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ యామజాల తిరుమలరావు (వైటిఆర్) అన్నారు. 52వ వార్డు ఎన్ఎడి కొత్త రోడ్డులోని ట్రినిటీ కంప్యూటర్ సెంటర్ ప్రాంగణంలో పి.గణబాబు గెలుపుపై పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా వైటిఆర్ మాట్లాడుతూ, గణబాబుకు వార్డులో అత్యధిక మెజార్టీ అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 52వ వార్డు టిడిపి అధ్యక్షులు మందలపు వాసుదేవరావు మాట్లాడుతూ, వైసిపి ఐదేళ్ల పాలనలో విధ్వంసం, అరాచకం తప్ప అభివృద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకమహంతి చంద్రశేఖర్, పూసపాటి బలభద్ర రాజు, పాల శీను, అప్పారావు, కోటాన ఈశ్వరరావు పాల్గొన్నారు.

పరీక్షల విభాగాన్ని పరిశీలించిన రిజిస్ట్రార్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం పరీక్షల విభాగాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. పరీక్షల విభాగంలోని పలు విభాగాలను ప్రత్యక్షంగా పరిశీలించి, సర్టిఫికెట్ల జారీ, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న విధానం తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా అభివృద్ధిచేసిన టాయిలెట్స్ బ్లాక్‌ను ప్రారంభించి, పరిశీలించారు. రిజిస్ట్రార్ వెంట డిప్యూటీ రిజిస్ట్రార్ సాంబమూర్తి పాల్గొన్నారు.

వినాయక ఆలయం ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని త్రిముఖగిరికి వినాయక స్వామి మొదటి వార్షికోత్సవానికి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పునరుద్ధరించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పెదపాడు ఉపాధి కూలీలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : పెదపాడు గ్రామంలో నిలిపివేసిన ఉపాధి హామీ పనులను పునరుద్ధరణ చేయాలని శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద ఉపాధి కూలీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. పని కల్పించని పక్షంలో భృతి ఇవ్వాలని తెలిపారు. పెదపాడు గ్రామంలో వారం రోజులుగా పనులు నిలుపుదల చేయడంతో ఉపాధి కూలీలు పని లేక ఖాళీగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికి పని కల్పించాలన్నారు .ఉపాధి కూలి పనులు నిలుపుదల చేయడంతో దళితులు ,పేదలు, రైతులు, కౌలు రైతులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇంతవరకు తీవ్ర ఎండల్లో పనిచేసి వర్షాలు పడేసరికి పనులు ఆపడం అన్యాయ మన్నారు. వెంటనే అధికారులు చొరవ తీసుకొని చట్ట ప్రకారం ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించాలన్నారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రాన్ని అంద జేశారు. నిరసన కార్యక్రమంలో సముద్రాలు, లక్ష్మి ,అప్పలనరసమ్మ, ఈశ్వరమ్మ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కొత్త ఎమ్మెల్యేలకు అభినందన



గంటాను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా, తదితరులు

ప్రజాశక్తి- కశింకోట : సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కొత్త ఎమ్మెల్యేలు భీమిలి గంటా శ్రీనివాసరావు, నర్సీపట్నంలోని అయ్యపాత్రుడును కశింకోట మండల టిడిపి నేతలు కలిశారు. శుక్రవారం గంటా, అయ్యన్న ఇళ్లకు వేర్వేరుగా వెళ్లి వారికి శుభాకాంక్షలు తెలిపారు. గంటాను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గొంతిని శ్రీనువాసరావు, నైనముశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, సిద్ధిరెడ్డి శ్రీను ఉన్నారు. ఇక చింతకాయలు అయ్యన్న పాత్రుడు కలిసిన వారిలో మండల టిడిపి అధ్యక్షులు కాయలు మురళి, శీరంశెట్టి వెంకటలక్ష్మి, గొంతుని లోవ అప్పారావు, కరణం గోవింద ఉన్నారు.

గంటాకు సత్కారం

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో భీమిలి ఎమ్మెల్యేగా బంపర్ మెజారిటీతో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన గంటా శ్రీనివాసరావును శుక్రవారం ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు సత్కరించారు. షిర్డీసాయినాథుని చిత్రపటాన్ని బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుబత్తుల తాతయ్య బాబు, అనకాపల్లి తెలుగుదేశం పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కేకేవి నారాయణరావు, అనకాపల్లి తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకష్ణ దొర, కాంద్రేగుల రవీంద్ర, శ్రీరామ్‌మూర్తి ఉన్నారు.

పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో....

అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన స్వగహంలో కలిసి శుభాకాంక్షలు అందజేశారు. తుమ్మపాల మాజీ గ్రామ సర్పంచ్, అన్నపూర్ణ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కర్రీ వెంకట సన్యాసినాయుడు(బాబి) గొంతిన శ్రీనివాసరావు, బుదిరెడ్డి సూరిబాబు, కర్రి రమేష్ పాల్గొన్నారు.

దాడి రత్నాకర్‌కు అభినందన



దాడి రత్నాకర్‌ను అభినందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-. అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి తిరుగులేని విజయం సాధించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని డివిఆర్. కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌ను అభినందించేందుకు మండలంలోని టిడిపి నేతలు నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. తగరంపూడి, వెంకుపాలెం, సిహెచ్.ఎన్. అగ్రహారం, కుంచంగి గ్రామాల టిడిపి నాయకులు, పాల సొసైటీ అధ్యక్షులు, అభిమానులు, కార్యకర్తలు, పాల సొసైటీ అధ్యక్షులు, సర్పంచులు తరలివచ్చి దాడి రత్నాకర్‌ను సత్కరించారు.

ఉపాధి రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గనిశెట్టి

ప్రజాశక్తి -పరవాడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం పరవాడ మండలం భరణికం గ్రామంలో పర్యటించారు.

మండుటెండలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు పనిప్రదేశంలో ప్రభుత్వపరంగా టెంట్లు వేసి నీడను కల్పించడంతోపాటు వడదెబ్బ సోకకుండా ఎండ నుంచి ఉపశమనానికి ఉపాధి కూలీలకు మజ్జిగ, మంచినీరు సౌకర్యం కల్పించాలని 30 శాతం వేసవి అలవెన్సు ఇచ్చి ఆదుకోవాలని, ఉపాధి కూలీలకు పేస్లిప్పులు అందజేసి, ప్రతి 15 రోజులకు ఒకసారి పని చేసిన కూలి డబ్బులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో భరణికం ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డు పనులు పూర్తి

- రూ.2 కోట్లతో ఉడా ఆధ్వర్యంలో 80 అడుగుల విస్తరణ



బస్‌స్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న స్టేషన్ రోడ్డు

ప్రజాశక్తి - యలమంచిలి : రెండు నెలలుగా నిర్మాణంలో ఉన్న రైల్వే స్టేషన్‌రోడ్డు సిమెంట్ రోడ్డు పనులు శుక్రవారంతో పూర్తయ్యాయి. రూ. 2కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన నిడదవోలు కాంట్రాక్టు సంస్థ శ్రీలక్ష్మీ కనస్ట్రక్షన్స్ ఈ పనులు చేపట్టి పూర్తిచేసిందని నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న కాంట్రాక్టర్ ప్రతినిధులు తెలిపారు. పాత తారురోడ్డును కొంతమేర తొలగించి, కాంట్రాక్టు సంస్థ రోడ్డు నిర్మాణ పనుల్ని, కల్వర్టు పనుల్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసింది. రోడ్డు మధ్యలోని డివైడర్‌లో విద్యుత్ స్థంభాల వేసే ప్రతిపాదన మార్పు చేసి మొక్కల్ని అలాగే ఉంచి పాదచారులెవరూ డివైడర్ దాటలేనంత ఎత్తున ఇనపగేట్లు ఎత్తు పెంచి నిర్మించారు. యలమంచిలిలో అతి రద్దీగా ఉండే రైల్వే స్టేషన్‌రోడ్డు సర్వాంగసుందరంగా తయారైంది. ఇదే రోడ్డులో ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలు, జాతీయ బ్యాంకు, మరికొన్ని ఆఫీసులు కూడా ఉండడంతో ఎల్ల వేళలా రద్దీగా ఉంటుంది. పూర్తి మెరుగులు దిద్దుకున్న విశాలమైన రోడ్డుకిరువైపులా పొంచివున్న ఆక్రమణలను అదుపు చేయాల్సిన బాధ్యత స్థానిక మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులపైనా ఉందని స్థానికులు భావిస్తున్నారు.

స్వీట్లు పంచుతూ సంబరం



యలమంచిలిలో స్వీట్లు పంచుతున్న శేఖర్, తదితరులు

ప్రజాశక్తి -యలమంచిలి : సుందరపు విజయకుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంపై శుక్రవారం స్థానిక కూరగాయల బజారు వీధితోని జనసేన నియోజకవర్గ కోర్‌కమిటీ సభ్యుడు గుర్రాల శేఖర్ స్వీట్స్ పంపిణీ చేశారు. జనసేన అభిమానులు, కార్యర్తలతో పాటు బిజెజి రాష్ట్ర కౌన్సిల్ మెంబరు గుర్రాల నగేష్, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు సత్కారం

అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సుందరపు విజయ్‌కుమార్‌ను శుక్రవారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు బంధువులు అచ్యుతాపురం ఎస్‌టిబిఎల్‌లోని అతని స్వగృహానికి తరలివచ్చారు. అచ్యుతాపురం ఎలమంచిలి సిఐలు ఎం బుచ్చిరాజు, గఫూర్, ఎస్ఐలు, మండల పరిషత్ సిబ్బంది , తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. పుష్పగుచ్చాలను అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఉదయాన్నే దేవాలయంలో పూజలు నిర్వహించిన విజయకుమార్, తర్వాత శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన వారందరినీ స్వయంగా సాదరంగా స్వాగతించారు ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను తన ఇంటి వద్ద .కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్ అనాథ పిల్లలు కలిశారు.

డైట్ విద్యార్థుల ప్రతిభ

- ఆటోమేటిక్‌గా మొక్కలకు నీరు సరఫరా చేసే యంత్రం రూపకల్పన



పరికరం తయారుచేసిన డైట్ విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి : మొక్కలకు అవసరమైనపుడు ఆటోమేటిక్‌గా నీటిని సరఫరా చేసే యంత్రాన్ని డైట్ విద్యార్థులు రూపొందించారు. ఈ పరికరం తయారు చేయడానికి రూ. 500 ఖర్చు చేసినట్లు విద్యార్థులు తెలిపారు. వేసవికాలంలో మొక్కలకు ఎక్కువ నీరు అవసరమైనపుడు మన ప్రమేయం లేకుండానే మొక్కలకు కావలసిన నీటిని ఈ పరికరం అందిస్తుందని ప్రాజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరిరావు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు గైడ్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.సునీల్ వ్యవహరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను సంరక్షించేందుకు అవసరమైన నీటిని ఆటోమెటిక్ అందించే పరికరాన్ని తమ కాలేజీ విద్యార్థుల రూపొందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రాజెక్టులో భాగస్వాములైన అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దుర్గాశ్యామ్‌ప్రసాద్. ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణప్రియ విద్యార్థులను అభినందించారు. ఎప్పుడూ సమాజానికి ఉపయోగపడే ప్రోజెక్ట్ చేసే బి. శేషగిరిరావును అభినందించారు.

సబ్బవరంలో పంచకర్లకు సూపర్ మెజారిటీ



పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం మండలంలో కూటమి తరపున పోటీచేసిన జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు తాజా సార్వత్రిక ఎన్నికల్లో గ్రామాల వారీగా భారీ మెజార్టీ లభించింది. మండలంలోని 24 పంచాయతీల్లోను, జీవీఎంసీ 88 వ వార్డులో మూడు పంచాయతీలలోను ప్రతి గ్రామంలో మెజార్టీ లభించింది. గ్రామాల వారీగా పరిశీలిస్తే, బంగారమ్మ పాలెంలో 488 ఓట్లు , రాయపుర అగ్రహారం 147, వంగలి253, అంతకాపల్లి 333, అయ్యన్నపాలెం 190, ఎల్లుప్పి 187, బోదువలస 301, గుల్లేపల్లి 676, మొగలిపురం 312, అమృతపురం 541, మల్లు నాయుడుపాలెం 531, తవ్వవాని పాలెం 528, సబ్బవరం మేజర్ పంచాయతీ 2004, ఇరువాడ 360, టెక్కలి పాలెం 437, ఆరిపాక 489, అసకపల్లి 926 ,గొల్లలపాలెం 380, పైడివాడ అగ్రహారం 412, గంగవరం 240, నంగినారపాడు 610, వెదుళ్ళ నరవ 681, నల్లరేగుల పాలెం 156, బాటజంగాల పాలెం 78, గాలి భీమవరం 239, గొట్టివాడ 643 మెజార్టీ ఓట్లు లభించగా పైడివాడ మరికొన్ని గ్రామాలలో ఇవిఎంలు సాంకేతిక లోపాల కారణంగా వివి ఫ్యాట్ స్లిప్పులు లెక్కించారు. ఆ మెజార్టీ వివరాలు ఇంకా ఇవ్వాల్సి ఉంది.

మాడుగుల సమగ్రాభివృద్ధికి కృషి : బండారు

ప్రజాశక్తి-కె.కోటపాడు: వైసిపి పాలనలో నిర్లక్ష్యానికి గురైన అన్ని రంగాలను పరిపుష్టి చేసి, మాడుగుల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని కొత్త ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం ఎన్నికల్లో విజయం తర్వాత తొలిసారిగా కే కోటపాడులో పర్యటించి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో భారీ మెజారిటీ అందించిన మాడుగుల ప్రజలకు పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. వెనుకబడి ఉన్న మాడుగుల నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు రోడ్‌మ్యాప్ తయారు చేస్తున్నామన్నారు. గ్రామాలకు చిన్నచిన్న రోడ్లు వేస్తే అభివృద్ధి జరగదని కేంద్రం నుండి నిధులు తీసుకువచ్చి భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యాసంస్థల నెలకొల్పాలన్నారు. ఏ నియోజకవర్గంలో లేనివిధంగా మాడుగులలో ఐదు సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయని, వైసిపి పాలనలో నిర్లక్ష్యానికి గురైన వాటిని అభివృద్ధి చేస్తానన్నారు. రైవాడ, దాచేరు, పెద్దేరు రిజర్వాయర్లు అభివృద్ధి చేస్తానన్నారు. తాచేరు నీటి వృధాను అరికట్టి, రిజర్వాయర్ గేట్లు మరమ్మత్తులు చేయిస్తామన్నారు. జలజీవన్ మిషన్ పనుల్లో అవినీతిపై సిఐడి విచారణ చేయించి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానన్నారు. 2019కు ముందు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడిందని, వారందరికీ న్యాయం చేస్తామన్నారు. కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు , పైలా ప్రసాదరావు, పీవీ జి కుమార్ , మండల పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్, జురెడ్డి రాము, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

వైసిపి రాక్షస పాలకులను తరిమికొట్టారు

దేవరాపల్లి: రాష్ట్రంలో వినాశన పాలన పోవాలని ప్రజలు కసిగా, పట్టుదలతో ఓటేసి కూటమి అభ్యర్థులను గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా శాయశక్తులా కృషి చేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత దేవరాపల్లి మండలంలో పర్యటించిన ఆయనకు ఘనస్వాగతం లభించింది.కాశీపురంలో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఇంటి వద్ద శుక్రవారం సాయంత్రం కేకును కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు .మండల నలుమూలల నుంచి వచ్చిన కూటమి శ్రేణులు ఎమ్మెల్యే బండారును ఘనంగా సత్కరించారు.అనంతరం బండారు మాట్లాడుతూ, ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష చేస్తానన్నారు.పైలా ప్రసాదరావు, పోతల పాత్రు నాయుడు, శరకాన సూర్యనారాయణ, వై. కరుణాకరరావు, కొమార బాబురావు,పెద్దాడ వెంకట రమణ, అవుగడ్డ కోటిపల్లి నాయుడు, చల్లా నానాజీ జనసేన మండల అధ్యక్షులు గొర్రుపోటు రామూర్తి నాయుడు, బీజేపీ మండల అధ్యక్షులు కాళ్ల ప్రసాద్, కాశీపురం సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లను పరిశీలించిన డిఇఒ



రికార్డులను తనిఖీ చేస్తున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పాఠశాలల సరఫరా చేయాల్సిన విద్యా కానుకల కిట్లను అనకాపల్లి డిఇఒ. కె.వెంకట లక్ష్మమ్మ శుక్రవారం పరిశీలించారు. అలాగే స్టాక్, రికార్డులను పరిశీలించారు. విద్యాకానుక కిట్లలోని పుస్తకాలలో మాజీ ముఖ్యమంత్రి జగన్ పొటోలుగాని, పేరుగాని ఎక్కడా లేకుండా చూడాలని స్థానిక ఎంఇఒ సూర్యనారాయణ మూర్తిని ఆదేశించారు. వెంకటేశ్వరరావు, సిఆర్‌పిలు, పార్ట్ టైం టీచర్లు పాల్గొన్నారు

9న మెగా మ్యూజిక్ ఈవెంట్

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక గవరపాలెం శ్రీ గౌరి గ్రంథాలయంలో ఈనెల 9 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిఆర్‌కె మ్యూజిక్ మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు జిఆర్‌కె మ్యూజిక్ అధినేత జి ఈశ్వర్, ఆర్గనైజర్ లీలారాణి తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి సుమారు 40 మంది గాయని గాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని సినీ పరిశ్రమలో ప్రఖ్యాత గాయని గాయకుల సుమధుర గీతాలు ఆలపిస్తారన్నారు. మ్యూజిక్ ట్రాక్‌పై నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అన్నారు. రసజ్ఞులు, సంగీత పిపాసులు, గాయని గాయకులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు చిట్టిబాబు కోటేశ్వరరావు తెలిపారు.శుక్రవారం మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల ఇంటికి వెళ్లి భవిత కేంద్రంలో తమ పిల్లలను చేర్పుకోవడం ద్వారా వచ్చే రాయితీలు, అవకాశాలను తల్లిదండ్రులకు వివరించారు. సమగ్ర శిక్ష పాఠశాల విద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే భవిత కేంద్రంలో నేర్పించడం ద్వారా పాఠశాలకు వెళ్లే పిల్లవానికి ఎస్కార్ట్ కు నెలకు 300, విద్యార్థి ట్రాన్స్‌పోర్ట్ కు నెలకు రూ.300, ఆడపిల్లలకు ప్రతినెల స్టైఫండు నిమిత్తం రూ. 200, పదిమంది విద్యార్థులకు చెప్పే ఉపాధ్యాయులకు నెలకు రూ.300, ప్రతి ఏటా విద్యార్థులకు వైద్య పరీక్షలు, అవసరమైన వీల్ చైర్స్, ట్రై సైకిల్, వినికిడి యంత్రాలు బ్రెయిలీ కిట్స్, ఎంఆర్ కిట్స్, బస్సు, ట్రైన్ పాసులు, సదరం క్యాంపు లపై అవగాహన, 9, 10 తరగతి విద్యార్థులకు రూ.9వేల నుంచి రూ.11 వేల వరకు జాతీయ ఉపకార వేతనాలు అందజేస్తారని వివరిస్తున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలని ప్రోత్సాహిస్తున్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్. యేసు రత్నం, సిహెచ్ రమాదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజుకు అభినందన



రాజుకు శుభాకాంక్షలు చెబుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : చోడవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన కెఎస్ఎన్.రాజును బుచ్చయ్యపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు సర్పంచ్లు ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు గోకువాడ కోటేశ్వరరావు, సీతయ్యపేట సర్పంచ్ వజ్రపు శ్రీను, మాజీ సర్పంచ్ కరణం నాగేశ్వరావు, ఐటీడీపీ కిల్లంపల్లి శ్రీను , నందవరపు రాజుబాబు,పాలక గంగాధర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసార పరిరక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : పచ్చిరొట్ట ఎరువులతో భూసారాన్ని సంరక్షించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. భూమి ఆరోగ్యంగా ఉండడానికి, భూసార పరిరక్షణకు, భూమి భౌతిక పరిస్థితి మెరుగుపరిచేందుకు పచ్చిరొట్ట ఎరువులు ఎంతో లాభదాయకం అన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ద్వారా భూమిలో సూక్ష్మజీవులు వద్ధి చెంది నేల సారవంతం అవుతుందన్నారు. పచ్చిరొట్ట పైరును మే జూన్ నెలలో వరి పంట వేసుకునే ముందు విత్తుకొని 45 రోజుల పూతదశ సమయంలో, వర్షాలు పడ్డాక నెలలో కలియదున్నాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాన్ని విత్తేముందు 24 గంటలు నీటిలో నానబెట్టి విత్తుకోవడం వల్ల మొలక బాగా వస్తుందన్నారు. జనుము ఎకరాకు 20 నుంచి 25 కిలోలు, జీలుగ 12 నుంచి 15 కిలోలు, పిల్లి పెసర ఐదు నుంచి 6 కిలోలు విత్తనాన్ని జల్లుకోవాలన్నారు. జనుము ద్వారా నాలుగు నుంచి 6 టన్నుల ఎరువు లభించడం ద్వారా 40 కిలోల నత్రజని, ఆరు కిలోల భాస్వరం 25 కిలోల పొటాషియం నేలకు లభిస్తుందన్నారు. అలాగే జీలుగ ద్వారా ఆరు నుంచి 8 టన్నుల ఎరువు ఇస్తుందని, 30 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం లభ్యమవుతుందన్నారు. పిల్లి పెసర ద్వారా రెండు నుంచి నాలుగు టన్నుల ఎరువు, 18 కిలోల నత్రజని, 25 కిలోల భాస్వరం, 13 కిలోల పొటాషియం లభిస్తుందన్నారు. అనకాపల్లి జిల్లాలో 24 మండలాల్లో 373 క్వింటాళ్ల జనుము, 559 క్వింటాళ్ల జీలుగ, 124 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో 50శాతం రాయితీపై అందించడం జరుగుతుందన్నారు. జనుము, జీలుగ కిలో 44 రూపాయలు, పిల్లి పెసర 67 రూపాయలు ధరతో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కష్టించి పనిచేసిన కార్యకర్తలకు అభినందన

ప్రజాశక్తి-అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో కష్టబడి పనిచేసి, 84వ వార్డులో కూటమి అభ్యర్థులకు మంచిమెజారిటీ వచ్చేలా కృషి చేసిన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలనుఅభినందించారు. 84వ వార్డు చినరాజుపేటలో కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి, టిడిపి వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో ఇటీవల ఎన్నికల్లో సేన అభ్యర్థి కొణతాల రామకష్ణ బిజెపి పార్లమెంట్ అభ్యర్థి సిఎం రమేష్ విజయానికి కష్టపడి పని చేసిన నాయకులను కార్యకర్తలను అభినందించారు. పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందనసభలో నీలబాబు మాట్లాడుతూ 84 వ వార్డు పరిధిలోని 18 బూత్‌లలో జనసేన, బిజెపి అభ్యర్థులకు అన్నిరౌండ్లలోనూ మంచి ఓట్ల ఆధిక్యత వచ్చిందని, వార్డు మొత్తంగా 6080 ఓట్లు మెజారిటీ సాధించామని నీలబాబు అన్నారు. కూటమి గెలుపులో టిడిపి నాయకులు కార్యకర్తలు, జనసేన బిజెపి సమిష్టి నాయకత్వంతో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, తలారి ప్రసాదు, కోట్ని రాంబాబు, సుగ్గు రామారావు, ఏనుగుల శ్రీను, రోకళ్ల తాతారావు, అలంక భోగేశు, బత్తుల శ్రీనివాసరావు, పొందూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో నిందితునికి రెండేళ్లు జైలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో మహిళపై దాడి చేసిన వ్యక్తికి రెండేళ్లు జైలు శిక్ష, రూ.నాలుగు వేల జరిమానా విధించినట్లు స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందిన గుండాల సంతోషి 2022లో మార్చి 12న ఇంటి వద్ద బోరింగ్ పనులు చేయించుకుంటున్న సమయంలో బోరింగ్ నుండి వస్తున్న బురద పక్కింటి మీద పడుతుందన్న కోపంతో పెచ్చేటి దుర్గారావు అనే వ్యక్తి రాయితో సంతోషి తలపై గాయపరిచాడు. దీనిపై సంతోషి ఫిర్యాదు మేరకు సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేసి, క్రైమ్ నెంబర్63/2022 కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. .అనకాపల్లి 12వ ఎఎంఎం కోర్టు దీనిపై విచారణ జరిపి, ఐపిసి 324,509 సెక్షన్ల ప్రకారం ముద్దాయి దుర్గారావుకు రెండేళ్లు జైలు శిక్ష, రూ.నాలుగు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని సి ఐ రమణ తెలిపారు.

ముగిసిన బాలికా సాధికారిత వర్క్‌షాప్

ప్రజాశక్తి- పరవాడ: ఎన్‌టిపిసి సింహాద్రి తన ఫ్లాగ్‌షిప్ సిఎస్ఆర్ నిధులతో బాలికా సాధికారత మిషన్ 2024ను విజయవంతంగా ముగించారు. జిఇఎమ్-2024 ముగింపు వేడుకలో ఆర్‌ఐఎన్ఎల్ డైరెక్టర్ (పర్సనల్) సురేష్ చంద్ర పాండే మాట్లాడుతూ, ఎన్‌టిపిసి సమాజానికి అందిస్తున్న సేవలను, సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా బాలికలను సాధికారతకు చేస్తున్న కృషిని అభినందించారు. ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్టు హెడ్ ఎస్.కె సిన్హా వర్క్‌షాప్ విజయవంతంగా పూర్తిచేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, పాల్గొన్న వారిని అభినందించారు. వారి భవిష్యత్తు విజయానికి శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు వారాల రెసిడెన్షియల్ వర్క్‌షాప్‌లో సమీప గ్రామాల నుండి 120 మంది బాలికలు చురుకుగా పాల్గొన్నారు. వారికి విద్యాపరమైన ప్రేరణ, వ్యక్తిత్వ వికాసం, సాధికారతను పెంపొందించడానికి రూపొందించిన వివిధ కార్యకలాపాలలో వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ఎన్‌టిపిసి సింహాద్రి 10వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తూ బాలభారతి పబ్లిక్ స్కూల్‌లో 10 మంది అగ్రశ్రేణి విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తుందన్నారు. కార్యక్రమములో జిఎంలు,హెచ్ఆర్‌లు, హెడ్, ప్రెసిడెంట్ దీపిక లేడీస్ క్లబ్, డిసి సిఐఎస్ఎఫ్ సిఎస్ఆర్ టీమ్, జిఇఎమ్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనకాపల్లి విద్యార్థికి ప్రథమస్థానం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2023 – 24 లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో అనకాపల్లి విద్యార్థికి ప్రథమస్థానం దక్కింది. కొత్తూరు అనకాపల్లి వర్తక సంఘం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివిన మొల్లి పార్థ నాగచైతన్య 2023 డిసెంబర్లో నిర్వహించిన పరీక్షల్లో 141 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. చైతన్య సోదరుడు సత్య మౌర్య తేజ 2022 –23 ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ప్రతిభచూపి, ఉపకార వేతనానికి ఎంపికయ్యాడు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని దేవిపురంలో తెలుగు భాషా మాధ్యమంలో శ్రీవిద్యా బిగినర్స్ కోర్స్ ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దేవిపురం గురుమాత అన్నపూర్ణమ్మ 4 రోజులలో మంత్ర సాధన, యంత్రపూజలు, తర్పణాలు థియరీతో బాటు ఆచరణ పూర్వకంగా నేర్పుకొంటారన్నారు. శిక్షణకు మార్తి రాధ, కె. రమ, షణ్ముఖ బాధ్యత వహిస్తున్నారు.

వాలంటీర్ల నియామకంపై ట్రోలింగ్స్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: వాలంటీర్ల నియామకంపై సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. వాలంటీర్‌ల నియామకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, డిగ్రీ విద్యార్హతతో గ్రామానికి రూ.పదివేల వేతనంతో నలుగురైదుగురిని నియమిస్తారని సోషల్ మీడియా లో ముమ్మరంగా ప్రచారం సాగుతుంది. వాట్సాప్ గ్రూపుల్లో ఈ వార్త ప్రచారం సాగుతుండడంతో పాటు, గ్రామాల్లో గల ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు నిరుద్యోగ యువకుల నుంచి ఫోన్లు ఒత్తిడి పెరుగుతోంది. దీంతో వారికి ఏమీ సమాధానం చెప్పాలో అర్థం కాక నాయకులు తలలు పట్టుకొంటున్నారు. ప్రభుత్వం ఇంకా కొలువు తీర లేదని చెప్పినా వినకుండా, నియామాలకు అవకాశం ఇచ్చిన వెంటనే తమకు ఛాన్సివ్వాలంటూ అపుడే ఒత్తిడి చేస్తున్నట్లు మండలంలోని గల పలు గ్రామాల టిడిపి నాయకులు వాపోతున్నారు. సోషల్ మీడియా పుణ్యమా అని ఇదెక్కడి గోలరా బాబూ అంటూ జుట్టు పీకుంటున్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో నర్సింగబిల్లి గ్రామంలో మలేరియా నిర్మూలన మాసోత్సవాల్లో భాగంగా వైద్యాధికారి డాక్టర్ యు.రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలను చైతన్య పరిచారు. వైద్య సిబ్బంది కే శివ, ఎం ప్రసాద్, పి ప్రసాద్, కెఎస్ నర్సింహారావు, నాగలక్ష్మి, శంకరరావు పాల్గొన్నారు

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



మాడుగుల గ్రంథాలయంలో హాజరైన పిల్లలు

ప్రజాశక్తి-పాయకరావుపేట:స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞన శిబిరాలు శుక్రవారంతో ఘనంగా ముగిసాయని గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు పేర్కొన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్. ఆచార్యులు అధ్యక్షతన ముగింపు వేడుకలకు స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఎస్.భవాణి హాజరయ్యారు. ఈ సంధర్భంగా భవాణి, రిసోర్స్ పర్సన్ సీతారామయ్య మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. రిసోర్స్ పర్సన్‌లు సీతారామమూర్తి, వై.అచ్యుతరావులను గ్రంథాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్.వి.రత్నం, యోగా టీచర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగుల గ్రంథాలయంలో విద్యార్థులకు పలు విధాలైన కార్యక్రమాలకు నిర్వహించి అవగాహన కల్పించామని గ్రంథాలయ అధికారి వై.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శ్రీనాదు శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని నక్కపల్లి, చినదొడ్డుగల్లు గ్రంథాలయాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నక్కపల్లిలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు పాల్గొన్నారు.చినదొడ్డుగల్లులో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో ముగింపు వేడుకల్లో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ వ్యవస్థాపకులు వెంకటరమణ, స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పారావు, బోధిగల్లం ఉపాధ్యాయులు ఫల్గుణరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.బండారు ట్రస్ట్ అధినేత బండారు గోవిందరావు సమకూర్చిన బహుమతులను విద్యార్థులకు అందజేశారు.విద్యార్థుల కోలాట ప్రదర్శన ఎంతగానో అలరించింది.

కోటవురట్ల:స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు.యుటిఎఫ్ మండల అధ్యక్షులు నర్సింగరావు మాట్లాడుతూ, గ్రంథాలయాలను సద్వినియోగించుకోవాలన్నారు



పాయకరావుపేటలో...

యుటిఎఫ్ సెక్రటరీ ప్రసాదు, గ్రంథాలయం అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

చీడికాడ:గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశామని గ్రంథాలయ అధికారిని జోగేశ్వరి తెలిపారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది , గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

గొలుగొండ:స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, ఈ వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గ్రంథాలయానికి ప్రతిరోజు వచ్చి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. నర్సీపట్నం బాలికల హైస్కూల్ ఉపాధ్యాయురాలు రాఘవ కుమారి గ్రంథాలయాలు, ప్రయోజనాలను వివరించారు.

మునగపాక: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు సభ జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసి రావు మాట్లాడుతూవేసవి విజ్ఞాన శిబిరాల ప్రేరణతో విద్యార్థులు గ్రంథాలయాల పాఠకులు గా విజ్ఞానాన్ని సముపార్జించుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారి ఎల్‌వి.రమణ, మండల విద్యాశాఖ సిఆర్‌పి బి అచ్యుతకృష్ణ, పాఠకులు కరుణాకర్ రావు, బి గణేష్ పాల్గొన్నారు.



గొలుగొండలో..

కశింకోట : మండలంలోని తాళ్ళ పాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు సభలో న ర్సంగబిల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి. సురేష్ కుమార్, విశ్రాంత లైబ్రేరియన్ జి మురళీకృష్ణ మాట్లాడుతూప్రతి విద్యార్థి గ్రంథాలయంలో సభ్యులుగా చేరి, పుస్తకాలను చదవాలని తద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారిని సిహెచ్. కరుణశ్రీ,, అచ్చర్ల సచివాలయం కార్యదర్శి ఎం.మహేష్, ఉపాధ్యాయులు కె. మహాలక్ష్మి నాయుడు, పాఠకులు సిహెచ్. భాస్కరరావు, యు. రమణబాబు, గ్రంథాలయాధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : పిల్లల్లో సృజనాత్మకతకు వేసవి శిక్షణ శిబిరాల దోహదపడతాయని స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి అన్నారు బుచ్చయ్యపేట శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపులో పాల్గొని,యోగా,ధ్యానం, నీతి కథలు,పద్య పఠనం, చిత్రలేఖనం వంటి వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు..గ్రంథ పాలకులు వి.కష్ణారావు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలకు రూ.50 లకే గ్రంథాలయ సభ్యత్వం కల్పిస్తామన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు సమావేశంలో స్థానిక ఎస్ఐ శంకర్రావు, సిహెచ్‌ఒ స్వర్ణలత పాల్గొని, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి. శిరీష ,పిడిపి రత్నకుమార్ ,చందు, సతీష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం: స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో సిఐ ఎం.బుచ్చిబాబు, తహశీల్దార్ సరోజిని పాల్గొన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను



బుచ్చయ్యపేటలో బహుమతుల ప్రదానం

సద్వినియోగం చేసుకోవాలని సిఐ పిలుపునిచ్చారు. 24 రోజుల విజ్ఞాన తరగతులు సద్వినియోగం చేసుకున్న విద్యార్థులను తహశీల్దార్ సరోజిని అభినందించారు గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఇఒ సిఆర్‌కె.దేవరాయలు, అచ్యుత స్కూల్ కరెస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, టీచర్ మాధవి, తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకట అప్పారావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపులో గ్రంథాలయ అధికారి ఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివిధ పోటీల్లో విజేతలకు ఎంఇఒ ఉషారాణి బహుమతులను అందజేశారు.. కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కొట్టాన రాంబాబు సిఆర్‌పి రమణ, వరదపురెడ్డి వెంకట రమణ, ఉషోదయ స్కూల్ మాస్టర్ సందీప్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎలమంచిలి : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగిసింది. పుల్లారావు మాస్టారు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పుస్తకపఠనమే ఆయుధంగా ఐఎఎస్ సాధించిన ఐఎస్ రావు తనయ అనురాధను సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి వి. ఆనంద్, సామాజిక కార్యకర్త టి.పాపారావు, రిటైర్డు డిగ్రీకాలేజి వైస్‌ప్రిన్సిపాల్ ఎ.పూరిజగన్నాథ్, షేక్ అబ్దుల్లా, వై.అప్పారావు, రిటైర్డు లెక్షరర్ సన్యాసిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ, బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యాన నిర్వహించారు. 45 మంది విద్యార్థులు, 30 మంది పెద్దలు హాజరయ్యారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జివిఎంసి 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాలయ ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన సిఐ రామకృష్ణ సైబర్ మోసాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో దాడి రమణశెట్టి, వేగి దివాకర్, శరగడం నరసింహ, ఆర్.జానకిరామ్, టీచర్ లక్ష్మీతేజ, రిటైర్డ్ టీచర్ ధనుంజయ్, డి.దేవుడు పాల్గొన్నారు.



పెందుర్తిలో గాంధీ విగ్రహానికి నివాళి ..

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:తెనాలి ఎమ్మెల్యేగా గెలిచిన జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను నర్సీపట్నం నియోజకవర్గం ఆ పార్టీ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్‌ను తన కార్యకర్తలతో కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, జనసేన పార్టీని ఆది నుంచి నాదెండ్ల మనోహర్ సమన్వయం చేసి నడిపించారన్నారు.



పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న నాయకులు

'పేట'లో నోటాకు మూడో స్థానం

- పోలైవని 4,107 ఓట్లు

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట నియోజక వర్గంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నోటాకు 4107 ఓట్లు పోలయ్యాయి. ఈనెల 4న జరిగిన ఎన్నికల లెక్కింపులో ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ కలిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత కు 1,20,042 ఓట్లు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుకు 76,315, కాకర నరసింహారావు (బహుజన సమాజ్ పార్టీ) 1637, బోని తాతారావు (కాంగ్రెస్ పార్టీ) 2087 ఓట్లు, కృష్ణ స్వరూప్ వడ్లమూరి (దళిత బహుజన పార్టీ) 1786, దూలపల్లి నాగేశ్వరరావు (జై భారత్ నేషనల్ పార్టీ) 259, పరవాడ రామకృష్ణ (ప్రబుద్ధ రిపబ్లిక్ పార్టీ) 285, భూర్తి ఏసయ్య (స్వతంత్ర అభ్యర్థి) 543, శెట్టిబత్తుల ధర్మరాజు (స్వతంత్ర అభ్యర్థి) 425 ఓట్లు పోలయ్యాయి. నోటాకు ఈవీఎంల ద్వారా 4090, పోస్టల్ బ్యాలెట్ 17 మొత్తం కలిపి 4107 ఓట్లు పోలయ్యాయి. కూటమి, వైసిపి అభ్యర్థుల మినహా , బరిలో నిలిచిన మిగిలిన 7 గురు అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు లభించాయి. కూటమి, వైసిపి అభ్యర్థులు కాకుండా, మూడో స్థానం నోటాకు దక్కింది. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితకు ఈవీఎంల ద్వారా 118675, పోస్టల్ బ్యాలెట్ 1367 కలిపి 120042 ఓట్లు రాగా, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుకు ఈవీఎంల ఓటింగ్ ద్వారా 75614, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 701 కలిపి మొత్తం 76315 వచ్చాయి.ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి పై కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత 43727 ఓట్లతో భారీ మెజార్టీతో విజయం సాధించి పేటను కైవసం చేసుకున్నారు.




నోటా గుర్తు



ప్రారంభిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ రూపవతి

గురుకులంలో వంట, భోజన శాలలు ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక గురుకులంలో కిచెన్ కం డైనింగ్ హాల్‌ను ఏపీ రెసిడెన్షియల్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపవతి శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలో కిచెన్ కం డైనింగ్ హాల్ భవనం శిథిలావస్థకు చేరడంతో, మరో భవనానికి మరమత్తు పనులు చేపట్టి నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు గురుకులం ప్రిన్సిపల్ కె.ఎస్ రత్నకుమారి, పేరెంట్స్ కమిటీ సమక్షంలో రూపవతి డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. కిచెన్‌లో సదుపాయాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచి సూచికరమైన పోషకాహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులం పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



సర్వే చేపడుతున్న ఎంఇఒ

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు సర్వే

ప్రజాశక్తి-చీడికాడ:విభిన్న ప్రతిభావంతులను భవిత కేంద్రంలో చేర్పించాలని ఎంఈఓ బొంజుబాబు కోరారు. మండలంలో విభిన్న ప్రతిబా వంతుల గుర్తింపు సర్వేలో భాగంగా మండలంలో కొత్తగా 20 మంది పిల్లలను గుర్తించారు.మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించి భవిష్యత్తు చక్కదిద్దుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు సరస్వతి, దేముడుబాబు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: వైసీపీ అధినేత వైయస్ .జగన్ మోహన్ రెడ్డిని శుక్రవారం నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ కలిశారు. తాడేపల్లిలో జగన్‌ను కలిసి ఈ ఎన్నికల్లో జరిగిన పరిణామాలపై సమీక్షించారు. పోలింగ్ విధానం, పోలైన ఓట్ల పై జగన్ తీరా తీశారు.


జగన్‌తో గణేష్



కొలతలు తీస్తున్న సిబ్బంది

బస్‌స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌కు కొలతలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో మేజర్ పంచాయతీ ఏ ఎల్ పురం బస్ స్టేషన్‌లో సిమెంట్ ప్లాట్ ఫారం ఏర్పాటు చేయడానికి శుక్రవారం కొలతలు తీసుకున్నారు. ఆర్టీసీ శాఖ నుంచి 6 లక్షల రూపాయల నిధులు కేటాయించారని, అందు నిమిత్తం ప్లాట్ ఫారం కొలతలు తీసుకుంటున్నామని గుత్తేదారుడు తెలిపారు. దీంతో కొద్దిపాటి వర్షం అయినా బురదమయంగా మారే ఆర్టీసీ బస్టాండ్‌లో ఇకనుంచి ప్రయాణికులకు ఇబ్బందులు తగ్గుతాయి. కొద్దిపాటి వర్షం కురిసిన ప్రయాణికులు బురదలోని బస్సులు ఎక్కేవారు. ప్లాట్ ఫారం నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామని గుత్తేదారుడు తెలిపారు.

ఆర్ఎస్‌డిపికి సన్మానం

ప్రజాశక్తి -పద్మనాభం: భీమిలి నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు 92401 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందడం, పాండ్రంగి పంచాయతీలో టిడిపికి 1324 ఓట్లు మెజార్టీ రావడంతో గ్రామానికి చెందిన మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజును గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామరాజు, మహంతి అప్పలరమణ (శ్రీనివాస్), కోరాడ కృష్ణ, పిన్నింటి సారధి, పిన్నింటి రమణ, పిన్నింటి వెంకటరావు, బొబ్బిలి సంతు, కర్రి ప్రేమ్, తాటిపూడి కృష్ణ, టి.సన్యాసిరావు, కామరాజు, శేఖర్, పాలూరి కృష్ణ, బత్తిన పెంటయ్య, చిన్నయ్య, అభిరామ్, దొంతల రాజేష్, బంక పెద్దినాయుడు, గణేష్ బాబు, కోన బాలు, కె.రమణ, పల్లంటి పాపారావు, వెన్ని అప్పలరాజు, వెన్ని బంగారునాయుడు, మధు, గణేష్ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న గ్రామస్తులు

మోదకొండమ్మ జాతరను జయప్రదం చేయాలి

- అల్లూరి జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత

ప్రజాశక్తి -పాడేరు : ఈనెల 9,10, 11 తేదీలలో నిర్వహించనున్న గిరిజన ఆరాధ్య దైవం మోదకొండమ్మ జాతరను విజవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. అమ్మవారి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేసి జాతరను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. అమ్మవారి ఘటాలు శతకంపట్టుకు తరలింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, రవాణా, విద్యుతు సదుపాయాలు, భోజన వసతి, వైద్య సేవలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డి. ఆర్.ఓ పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర తదితరులు పాల్గొన్నారు.

రహదారులు ఇలా..

వెళ్లేది ఎలా..?

- ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలు
- ప్రమాదకరంగా రాకపోకలు
- మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని పలు రహదారులకు ఇరువైపులా తుప్పలు ఎక్కువగా పెరిగి పోవడంతో రోడ్డున వెళ్లేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మలుపుల వద్ద ,రాత్రి సమయంలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. మండలంలో వెంకటాపురం రోడ్డు నీళ్లగుంట పాములవాక, పీకేపల్లి, అదే విధంగా ప్రధాన రహదారి పోలవరం రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పేరుకు పోవడంతో ఇరుకుగా మారడంతో పాటు మలుపులు వద్ద, పలుచోట్ల ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనబడని పరిస్థితి ఉంది. మరోవైపు ఎదురెదురుగా, వెనుకవైపు నుంచి వాహనాలు మళ్లిపోయే పరిస్థితులు లేక పోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సచివాలయాల్లో నిధుల కొరత కారణంగా, పంచాయతీల పరిధిలోని రోడ్లను సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ప్రధాన రోడ్ల దుస్థితిపై అధికారులు దృష్టిపెట్టలేదు దీంతో, పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న తుప్పలను తొలగించి, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు, పలు గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.


నర్సీపట్నం, పోలవరం రోడ్డులో ఇరువైపులా ఉన్న తుప్పలు

సెంట్రల్ బ్యాంక్ మహిళా బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శతాబ్ద కాలంగా వినియోగదారులకు సేవలందిస్తున్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నంలోని ద్వారకానగర్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఉమెన్ బ్రాంచ్‌ని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ఆర్.శేషకుమారి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి శాఖను ప్రారంభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సాధారణ ఆరోగ్య చిట్కాలతో సిబ్బందికి, వినియోగదారులకు మార్గనిర్దేశం చేశారు. గౌరవ అతిథిగా పాల్గొన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ కె.ధరాసింగ్ నాయక్ మాట్లాడుతూ ఆల్ ఉమెన్ బ్రాంచ్ ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు. ఈ బ్యాంక్ ఎక్కువగా మెట్రో / అర్బన్ / సెమీ అర్బన్ రూరల్ ఏరియాల్లో విస్తరించి దాదాపు 4600 శాఖలతో సేవలు అందిస్తోందని తెలిపారు. ప్రజల నుండి డిపాజిట్లను స్వీకరించడం, అవసరమైన వ్యక్తులకు రుణాలు ఇవ్వడం వంటి సాధారణ వ్యాపార కార్యకలాపాలతో పాటు సామాజిక భద్రతా పథకాలను ప్రభుత్వాల ద్వారా వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. బ్యాంకు విశాఖపట్నం రీజియన్ రీజినల్ హెడ్ ఎఎస్ఎన్.మూర్తి అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్లు రవీంద్ర, ఆదిల్, చందన్ పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ప్రముఖ వైద్యురాలు శేషకుమారి


మరమ్మతుకు గురైన బోరు

బోరు మరమ్మతు చేపట్టరూ..

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సీహెచ్. నాగాపురం రామాలయం వద్ద పాడైపోయిన తాగునీటి బోరును బాగు చేయించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. గత వారం రోజులుగా ఈ బోరు మరమ్మత్తులకు గురైందని తెలిపారు. దీనిపై పలుమార్లు అధికారులకు, పాలకులకు తెలియజేసినా స్పందించలేదని వాపోయారు. తక్షణమే ఈ బోరుకు మరమ్మత్తులు పనులు చేపట్టాలని కోరారు.

సమస్యలపై ఏకరువు

మండల సమావేశంలో విన్నవించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: రావికమతం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను జంబ్లింగ్ పద్ధతిలో మత్సవానిపాలెం పాఠశాల పిల్లలను దొండపూడి పాఠశాలకు తరలించడంతో పిల్లలు మెయిన్ రోడ్డు దాటి వెళ్ళడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని సర్పంచ్ ఎం.గణేష్ తెలిపారు. మత్సవానిపాలెం గ్రామంలోనే మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని సర్పంచ్ మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ దృష్టికి తీసుకెళ్లారు. ఇల్లు నిర్మాణాలు పూర్తి చేసుకున్నప్పటికీ బిల్లులను ఇవ్వలేదని పొన్నవోలు సర్పంచ్ విరోధి రాజారావు, తదితరులు హౌసింగ్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. బాల్య వివాహాలు జరగకుండా అందరూ సహకరించాలని ఐసిడిఎస్ సిడిపిఓ ఉషారాణి తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం వివరాలు ప్రతినెలా గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీలకు అందజేయాలని వైస్ ఎంపీపీ దంట్ల రమణ సిడిపిఓ దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ సమస్యల పై ఆ శాఖ అధికారులకు ఫోన్ చేసినా స్పందించ లేదని ఏఈ నందనను కవగుంట సర్పంచు దాసరి సూర్యకుమారి, గొంప ఎంపిటిసి సూర్యనారాయణ, కొత్తకోట ఎంపిటిసి పూడి దేవాలు నిలదీశారు. కొత్తకోట మేజర్ పంచాయతీలో పంచాయతీ షాపులు మరమ్మతుకు గురయ్యాయని, వాటిని మరమ్మతు చేయించి అద్దెకు ఇవ్వాలని, గ్రామ సమీపంలో ఎకరా 80 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని తక్షణమే సంబంధిత అధికారులు స్పందించాలని కొత్తకోట ఎంపిటిసి దేవా సభ దృష్టికి తీసుకు రావడంతో దీనిపై స్పందించిన ఎండిఓ బానోజీరావు వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పైలా రాజు